క్లుప్తంగా

నేడు విజయవాడకు డీఎస్సీ అభ్యర్థులు

కర్నూలు కల్చరల్: విజయవాడలో జరిగే డీఎస్సీ విజయోత్సవ సభకు వెళ్లేందుకు రాయలసీమ యూనివర్సిటీ నుంచి బస్సులను బుధవారం ఉదయం 8:15 గంటలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ప్రారంభిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్ తెలిపారు. ఉదయం 8:30 గంటలకు బస్సులు బయలుదేరతాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ఉదయం 8 గంటలకల్లా తమకు కేటాయించిన బస్సుల్లో కూర్చోవాలని సూచించారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి



దీక్ష చేపట్టిన న్యాయవాదులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ న్యాయవాదులు చేపట్టిన దీక్షలు రెండో రోజూ కొనసాగాయి. శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లోని శిబిరంలో న్యాయవాదులు వి.కృష్ణమూర్తి, ఎన్.నరసింహ, బి.శ్రీనివాసులు, అయ్యస్వామి, రాము తదితరులు దీక్షలో కూర్చొని శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జోరు వర్షం కురుస్తున్నా న్యాయవాదుల దీక్షలు కొనసాగాయి.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, ఈగల్ క్లబ్ సభ్యులు

కర్నూలు కల్చరల్: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి సూచించారు. క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఈగల్ క్లబ్ సంయుక్త నిర్వహణలో మాదక ద్రవ్యాల సంబంధిత నేరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, చెడు అలవాట్లకు లోను కాకూడదన్నారు. ఈగల్ క్లబ్ ఎస్ఐ సృజన్ కుమార్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు అలవాటు పడితే బంగారు భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. వారి కుటుంబాలు, వ్యవస్థ సైతం దెబ్బతింటుందన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఫకృన్నీసా బేగం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల పరిశీలన

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని గీతాంజలి నర్సింగ్ కళాశాలను డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ పరిశీలించారు. అక్కడి ఉపాధ్యాయ బృందంతో, విద్యార్థులతో విడివిడిగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. నర్సింగ్ కోర్సులో భవిష్యత్ కార్యాచరణ గురించి వివరించారు. ఆయనకు కళాశాల కరస్పాండెంట్ పెరుగు విజయవర్ధన్ రెడ్డి జ్ఞాపిక ఇచ్చి సన్మానించారు.

సంక్షేమ పథకాల గురించి తెలుసుకోవాలి



అవగాహన చిత్రపటాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: విద్యార్థులు ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకుని, వారివారి కుటుంబాలకు వివరించాలని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం క్లస్టర్ యూనివర్సిటీలో వికసిత్ భారత్ సేవా పర్వ్ -2025 వర్క్‌షాప్‌ను ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన కోసం ఎన్నో ప్రతిష్టాత్మకమైన పథకాలు ప్రవేశపెడుతున్నాయన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు, చదువు రాని వారికి పథకాల గురించి విద్యార్థులు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తు చేశారు. మేక్ ఇన్ ఇండియా పేరుతో స్వదేశీ వస్తువులను కొనడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా తయారవుతుందన్నారు. తెలుగు శాఖ అధ్యాపకురాలు డాక్టర్ ఎం.ఫమీదా బేగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ ప్రసాద్‌రెడ్డి, డీన్ వాహిజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చట్టరీత్యా నేరం

ఓర్వకల్లు: గంజాయి సాగుచేయడం చట్టరీత్యా నేరం అని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వనజకుమారి హెచ్చరించారు. ఆమె మంగళవారం మండలంలోని సోమయాజులపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లోని ఆర్ఎస్‌కేలలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఏఓ మధుమతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సతీష్‌కుమార్, ఏడీఏ వనజకుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వనజకుమారి మాట్లాడుతూ.. రహస్య ప్రాంతాల్లో గుట్టు చప్పుడుకాకుండా గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రైతులు సాగు చేసిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పత్తి, మొక్కజొన్న పంటలను తెగుళ్ల బారి నుంచి కాపాడుకునే విధానాలను రైతులకు వివరించారు. ఏఈఓలు, ఆర్ఎస్‌కేల వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో దేశభక్తి, సమాజసేవ

- స్వచ్ఛంద సేవలో యువత
- వివిధ సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు
- జిల్లాలోని విద్యాసంస్థల్లో 52 ఎన్ఎస్ఎస్ యూనిట్లు
- ఐదు వేలకు పైగా ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు
- నేడు జాతీయ సేవా పథకం దినోత్సవం



ఆర్‌యూలో శుభ్రత కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



అవగాహన ర్యాలీలో వలంటీర్లు

కర్నూలు కల్చరల్: యువత ప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసం. అయితే భావి భారతాన్ని నిర్ణయించాల్సింది యువకులే. దేశ పురోభివృద్ధిలోనూ ఉద్యమాల్లోనూ విద్యార్థులు పాలు పంచుకుంటుంటారు. అలాగే మనిషి మరో మనిషికి సహకరించడం మానవతా లక్షణం. విద్యార్థులు చదువుకుంటూ వారి విద్యాభ్యాసానికి ఆటంకం కలగకుండా దేశభక్తి కలిగి ఉండి సమాజ సేవలో పాలు పంచుకోవడం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) లక్ష్యం. సమాజంలోని రుగ్మతలను రూపు మాపేందుకు ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవ చేసేందుకు ఏర్పాటైందే ఎన్ఎస్ఎస్. జిల్లాలో ఐదు వేలకు పైగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎలాంటి లాభాపేక్ష లేకుండా స్వచ్ఛంద సేవలో పాలు పంచుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో యాక్టీవ్‌గా ఉన్న ఎన్ఎస్ఎస్ యూనిట్లు 51 ఉన్నాయి. ప్రతి యూనిట్‌లో వంద మంది చొప్పున 5100 మంది వలంటీర్లు ఎన్ఎస్ఎస్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఎన్ఎస్ఎస్ ఉద్దేశం

- వలంటీర్లకు 'క్యాంపస్ అండ్ కమ్యూనిటీ', 'కాలేజ్ అండ్ విలేజ్', 'నాలెడ్జ్ అండ్ యాక్షన్' లక్ష్యంగా ఎన్ఎస్ఎస్ ఏర్పాటైంది.
- సమాజంలోని అవసరాలు, సమస్యలను గుర్తించడం వాటి పరిష్కారంలో పాలు పంచుకోవడం.
- తమలో తాము సామాజిక పౌర బాధ్యతల భావనను పెంపొందించుకోవడం.
- వ్యక్తిగత కమ్యూనిటీ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనడంలో వలంటీర్లు వారి జ్ఞానాన్ని ఉపయోగించుకోవడం.
- నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామిక విలువలు పెంచుకోవడం.
- అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం
- జాతీయ సమైక్యత, సామాజిక సామరస్యాన్ని అభ్యసించడం.

చేపట్టాల్సిన కార్యక్రమాలు

- విద్యా సంస్థలను శుభ్రంగా ఉంచడం, తోటలు పెంచడం, రోడ్లు వేయడం.
- పరిసర గ్రామాలను దత్తత తీసుకొని రోడ్లు వేయడం, మురికి వాడలను శుభ్రపరచడం, నిరక్షరాస్యులకు విద్య బోధించడం.
- ఆరోగ్య సూత్రాలు, వయోజన విద్య ఆవశ్యకతను, జనాభా సమస్య నివారణను ప్రజలకు తెలియజేయడం.
- వరదలు వచ్చినప్పుడు, అగ్ని ప్రమాదాల్లోనూ సహాయం చేయడం.
- ధనవంతుల నుంచి విరాళాలు సేకరించి బీదవారికి, అనాథలకు, అభాగ్యులకు సహాయ పడటం.
- పొదుపు ఆవశ్యకతను, అంటువ్యాధుల వల్ల వచ్చే అరిష్టాలను అరికట్టే విధానాలను ప్రచారం చేయడం.

కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం



జాతీయ సేవా పథకం ద్వారా సాధారణ, స్పెషల్ క్యాంప్‌లలో పాల్గొనడంతో అనేక కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం. కొత్త స్నేహాలు, గ్రామాల్లో ఉన్న సమస్యలు వాటి పరిష్కారానికి వలంటీర్లమందరం చర్చించుకొని పరిష్కరించడం, సామాజిక రుగ్మతలపై ర్యాలీల్లో పాల్గొనడం, రక్తదానం చేయడం లాంటివి గొప్ప అనుభూతినిస్తున్నాయి. – ప్రవీణ్, ఎన్ఎస్ఎస్ వలంటీర్, ఆర్‌యూ

యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారు



జాతీయ సేవా పథకంలో యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఆర్‌యూ పరిధిలో యూనివర్సిటీలో నాలుగు యూనిట్లు, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో 51 యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్‌లో అమ్మాయిలు, అబ్బాయిలు వంద మంది ఉంటారు. వలంటీర్లు సాధారణ క్యాంప్‌లతో పాటు స్పెషల్ క్యాంప్‌ల్లో పాల్గొని గ్రామీణ ప్రజలకు అనేక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఉత్సాహవంతులైన యువతీ యువకులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని తమ సేవా తత్పరతను చాటుతున్నారు.

– డాక్టర్ పి.నాగరాజు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్, రాయలసీమ యూనివర్సిటీ

గర్వంగా ఉంది



ఎన్ఎస్ఎస్‌లో వలంటీర్‌గా ఉండటం ఎంతో గర్వంగా ఉంది. వర్సిటీలో పచ్చదనం, శుభ్రతలో పాలుపంచుకుంటున్నాం. రక్తదాన శిబిరం, హెల్త్ అవేర్‌నెస్ ప్రోగ్రాంలలో పాల్గొనడంతో అనేక విషయాలు తెలుసుకుంటున్నాం. మమ్మల్ని మేము చైతన్యవంతమవుతూ సమాజ చైతన్య కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతుండటం సంతోషంగా ఉంది. – లక్ష్మి లిఖిత, ఎన్ఎస్ఎస్ వలంటీర్, ఆర్‌యూ

క్యాన్సర్‌పై అవగాహన పెరగాలి



మాట్లాడుతున్న డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు

కర్నూలు(హాస్పిటల్): క్యాన్సర్‌పై మహిళల్లో అవగాహన పెరగాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు సూచించారు. 'స్వస్త్ నారీ–సశక్తి పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్ ఓపీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ.. దేశంలో క్యాన్సర్ కేసులు అధికమవుతున్నాయని, మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని చెప్పారు. ఈ వ్యాధిపై అవగాహనతో ముందుగా వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స తీసుకుంటే నయం చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, నోడల్ ఆఫీసర్ డాక్టర్ మాధవీశ్యామల, డాక్టర్ సోమప్ప, డాక్టర్ హర్ష తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో..

బి.తాండ్రపాడులోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ శిక్షణ కార్యక్రమంలో మంగళవారం నిర్వహించిన జిల్లా మహిళా సమాఖ్య కార్యవర్గ సమావేశంలో జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి పాల్గొని ప్రసంగించారు. మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేక వైద్యశిబిరాలు అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.


'డప్పు' ఆయుధంగా ఉద్యమిస్తాం



డప్పు వాయిస్తూ నిరసన తెలుపుతున్న కళాకారులు

కర్నూలు(సెంట్రల్): డప్పు కళాకారుల సమస్యలను పరిష్కరించకపోతే డప్పే ఆయుధంగా ఉద్యమిస్తామని ఏపీ డీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి బి.కరుణాకర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారం కోసం దండెత్తారు. డప్పు వాయిస్తూ తమ సమస్యలను వినాలని అధికారులకు విన్నపాలు పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా ఒక్క కళాకారుడికి పెన్షన్ ఇవ్వలేదన్నారు. డప్పు కళాకారుల పెన్షన్ వయసును 45 ఏళ్లకు తగ్గించాలని, పెన్షన్ సొమ్మును రూ.7 వేలకు పెంచాలని, మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని, వయసుతో సంబంధం లేకుండా ప్రతి కళాకారుడికి గజ్జెలు, డ్రస్సు, ఆరోగ్య బీమాను వర్తింపజేయాలని, ప్రయాణం రాయితీ ఇవ్వాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన విన్నపాన్ని డీఆర్వో సి.వెంకటనారాయణమ్మకు అందజేశారు. కేవీపీఎస్ నాయకులు విజయమ్మ, యేసురాజు, ఆనంద్, దస్తగిరి, తాయన్న, మాణిక్యం, చిన్నరాజు, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యపై అసెంబ్లీలో చర్చించాలి



మాట్లాడుతున్న కె.శ్రీనివాసులు

కర్నూలు(సెంట్రల్): నిరుద్యోగ సమస్యపై కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించాలని, ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేస్తోందన్నారు. ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పి మోసం చేసిందని మండిపడ్డారు. ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామన్న లోకేష్ దానిపై పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. వెంటనే ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే యూనివర్సిటీల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉండడంతో నాణ్యమైన విద్యా బోధన కరువైందన్నారు. కర్నూలు జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, 75 శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలని కోరారు. నగర కార్యదర్శి బీసన్న పాల్గొన్నారు.

భారీ వర్షాలపై అప్రమత్తం

కర్నూలు (సెంట్రల్): వాతావరణ శాఖ సూచనల మేరకు వచ్చే నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖల అధికారు లు రైతులకు ఎప్పటికప్పుడు పంటలు నష్టపోకుండా సూచనలు ఇవ్వాలని, ఎక్కడైనా పంటలు దెబ్బతింటే ఆ వివరాలు తనకు నివేదించాలని ఆదేశించారు. హోర్డింగ్స్, విద్యుత్ స్తంభాలు, చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాల సమీపంలో ఉండొద్దని ప్రజలకు సూచించారు. అలాగే నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న వాగులు, వంకలు దాటవద్దని సూచించారు.

'బన్ని' బందోబస్తుపై వినతి

కర్నూలు (టౌన్): వచ్చే నెల 2వ తేదీన దేవరగట్టులో జరిగే మాళ మల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు కోరారు. ఆయన మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిశారు. దేవరగట్టు బన్నీ ఉత్సవంపై చర్చించారు. భక్తులు బన్నీ ఉత్సవం ప్రశాంతంగా నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

అల్జీమర్స్‌పై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, పీజీలు

కర్నూలు(హాస్పిటల్): వృద్ధుల్లో మతిమరుపు సమస్యను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని సైకియాట్రిస్ట్ డాక్టర్ శివశంకర్‌రెడ్డి సూచించారు. 'ప్రపంచ అల్జీమర్స్ డే' సందర్భంగా మంగళవారం పెంచికలపాడులోని విశ్వభారతి మెడికల్ కాలేజీలో సైకియాట్రి విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణనాయక్ ప్రారంభించారు. ఈ మేరకు కళాశాలలో, గ్రామంలో మెమోరీ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల్లో, విద్యార్థుల్లో అల్జీమర్స్‌పై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అల్జీమర్స్ ప్రాబల్యం, ఈ రుగ్మత ప్రమాద కారకాలు, జ్ఞాపకశక్తి సమస్యలు ఎలా గుర్తించాలో ఆయన వివరించారు. సమస్య నివారణకు మధ్య వయస్సు నుంచే రోజువారీ వ్యాయామం, మేధో కార్యకలాపాల్లో పాల్గొనడం, మానసిక ఒత్తిడి తగ్గించడం, రక్తపోటు, మధుమేహం అదుపులో ఉంచడం, మద్యం, ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. వైద్యాధికారులు రవి కళాధర్‌రెడ్డి, వీరేష్, మయూరనాథ్‌రెడ్డి, అభిషేక్, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ సబ్ స్టేషన్లు, లైన్లకు సంబంధించి వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 24న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా సంతోష్‌నగర్ సెక్షన్ పరిధిలోని 11 కేవీ పంపుహౌస్, ఫీడర్ 11 కేవీ అశోక్‌నగర్ ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటరమణ కాలనీ, రామలింగేశ్వర నగర్, అశోక్ నగర్, కప్పల నగర్, శ్రీకృష్ణ కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

థర్డ్‌డిగ్రీ ప్రయోగించడం అన్యాయం

కర్నూలు(సెంట్రల్): మైదుకూరు నియోజకవర్గంలోని దువ్వూరుకు చెందిన మాదిగ మురళీమోహన్‌పై ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రోద్బలంతో ఎస్ఐ వినోద్‌కుమార్ థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అన్యాయమని, తక్షణమే ఎస్ఐను విధుల నుంచి తప్పించాలని బీఎస్పీ కర్నూలు నగర అధ్యక్షుడు రాజ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలి పని చేసుకునే మురళీమోహన్‌పై దొంగతనం కేసు మోపి పోలీసులు ఇష్టానుసారంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. ఈ ఘటనపై ఎస్పీ విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత

కర్నూలు(సెంట్రల్): వచ్చే స్థానిక ఎన్నికల్లో బీసీలకు అధికంగా సీట్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డీవీ సాంబశివుడు తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో బీసీలు ఎక్కువగా ఉన్నారని, దాదాపు 140 కులాలు ఉన్నాయని, ఆయా కులాలకు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికంగా సీట్లు ఇస్తుందని, పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. నాయకులు క్రాంతినాయుడు, దేవిశెట్టి ప్రకాష్, సయ్యద్ ఖాద్రిపాషా, షేక్ ఖాజా హుస్సేన్, షేక్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సకాలంలో సరుకులు ఇవ్వాలి



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): ప్రతి నెలా 5వ తేదీన అంగన్‌వాడీలకు సరుకులు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య డీలర్లను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆమె మినీ కాన్ఫరెన్స్ హాలులో అంగన్‌వాడీలకు సరుకుల అందజేతపై ఐసీడీఎస్ పీడీ, డీఎస్‌డీఓ, సివిల్‌సప్లై డీఎం, సీఎస్ డీటీలు, సీడీపీఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో చదువుకునే ఆరేళ్లలోపు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నిర్ణీత సమయానికి సరుకులు ఇచ్చేందుకు వీలుగా ఐదో తేదీలోపు వాటి పంపిణీ జరిగేలా చూడాలని సివిల్ సప్లై డీఎం ఎ.వెంకటరాముడును ఆదేశించారు. ఇదే సమయంలో అంగన్‌వాడీ టీచర్లు వారికి కేటాయించిన షాపునకు వెళ్లి నాణ్యతను పరిశీలించి ఆహార పదార్థాలను ఒకేసారి తెచ్చుకునేలా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ విజయను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్‌ఓ కార్యాలయ ఏఓ సువర్ణమ్మ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద పాల్గొన్నారు.

లోపాల్లేని ఓటరు జాబితాను రూపొందించండి



మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): లోపాలు లేకుండా ఓటర్ల జాబితాను రూపొందించాలని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. ఆయన మంగళవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో బీఎల్‌ఓలకు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ -2025 కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్పెషల్ సమ్మరీ రివిజన్ కోసం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను సమగ్రంగా పరిశీలించి డేటా మ్యాపింగ్ చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో కచ్చితత్వం కోసం డూప్లికేట్ పేర్ల తొలగింపు, మరణాలు, చిరునామా మార్పులు వంటి అంశాలను సవరించి సమగ్ర జాబితా రూపొందించాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియను ఈనెల 25వ తేదీ లోపు పూర్తి చేసి నెలాఖరుకు కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఓటర్లు తమ వివరాలకు https://ceoandhra.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు. ఫారం 6, 7, 8 సవరణల కోసం స్థానిక బీఎల్‌ఓలను సంప్రదించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్లు సుబ్బన్న, వాజిద్, ఆర్ఐలు రాజు, సుహేయిల్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్–2.0 కింద అంగీకార్ కార్యక్రమంపై అవగాహన, అలాగే మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని కమిషనర్ పరిశీలించారు. శిబిరంలో కమిషనర్, మున్సిపల్ ఉద్యోగులు రక్తపోటు, మధుమేహం, హృదయ సంబంధిత పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే మరింత మెరుగ్గా పనిచేయగలుగుతారన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అంగీకార్ కార్యక్రమంలో పీఎంఏవై కింద దరఖాస్తులను వేగవంతం చేయాలన్నారు. గృహ రుణాలపై వడ్డీ సబ్సిడీ, పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన లాభాలు, గృహ ప్రవేశ కార్యక్రమాలు, తక్కువ ఆదాయ వర్గాల కోసం లోన్ మేళాలు వంటి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సోషల్ డెవలప్‌మెంట్ స్పెషాలిటీ డాక్టర్ పెంచలయ్య పాల్గొన్నారు.

జయహో జగన్మాత



లలితా పీఠంలో సామూహిక పూజల్లో భక్తులు



సుబేధార్ వీధిలో..



కల్లూరు కన్యకా పరమేశ్వరి ఆలయంలో..



గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలో..



చిన్న అమ్మవారి శాలలో పరాశక్తిగా..



సప్తగిరి నగర్ చౌడేశ్వరీ దేవి ఆలయంలో..

కర్నూలు కల్చరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమార్చనలు, హోమాలు, రథోత్సవం, లలితా సహస్రనామ పారాయణం చేశారు. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాల వద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నాగలాపురం సుంకులా పరమేశ్వరి ఆలయం, వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం, కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం, సప్తగిరి నగర్‌లోని చౌడేశ్వరి దేవి ఆలయం, బుధవార పేట కాళికాంబ ఆలయం, వన్‌టౌన్ కాళికాంబ ఆలయం, చిత్తారి వీధి నిమిషాంబ దేవి ఆలయం, నన్నూరు సరస్వతీ దేవి ఆలయంలో గాయత్రీ దేవిగా, చిన్న అమ్మవారి శాలలో పరాశక్తిగా, పెద్ద అమ్మవారిశాలలో అన్నపూర్ణగా, వన్‌టౌన్ గీతా మందిరంలో కాలస్వరూపిగా, బండమెట్ట గంగాభవాని ఆలయంలో బాలా త్రిపుర సుందరిగా, బండమెట్ట అంబా భవాని ఆలయం, అరోరానగర్ రాజరాజేశ్వరీ దేవి ఆలయం, సూర్యనారాయణస్వామి ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.



పెద్దఅమ్మవారి శాలలో అన్నపూర్ణగా..



నాగలాపురంలో గాయత్రీ దేవిగా..



బండమెట్ట గంగా భవాని ఆలయంలో..



సూర్యనారాయణ స్వామి ఆలయంలో..



గోదా గోకులంలో..



నిమిషాంబదేవి ఆలయంలో..



చాణిక్యపురి కాలనీలో బొమ్మల కొలువు



సత్యసాయి మందిరంలో త్రిశక్తి దేవిగా..